
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

సోమవారం 14 అక్టోబరు 2024



అంతర్జాతీయ నృత్యోత్సవ ప్యానెల్ ప్రెజెంటర్‌గా ఒగ్గు రవి



డాక్టర్ ఉస్తాద్ ఒగ్గు రవి

లింగాలఘణపురం, అక్టోబరు13: కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సంగీత నాటక అకాడమీ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ నృత్యోత్సవ ప్యానెల్ ప్రెజెంటర్‌గా లింగాలఘణపురం మండలం మాణిక్యాపురంకు చెందిన ప్రఖ్యాత ఒగ్గు కళాకారుడు డాక్టర్ ఉస్తాద్ ఒగ్గు రవి ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 21 వరకు న్యూఢిల్లీలో జరిగే ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియన్ డ్యాన్స్ అంతర్జాతీయ నృత్యోత్సవ పోటీలను పరిశీలించి అకాడమీకి రిపోర్ట్ చేయాల్సిందిగా ఆహ్వానం అందింది. ఈమేరకు వారం రోజుల పాటు జరిగే పోటీలను పరిశీలించేందుకు ఒగ్గు రవి న్యూఢిల్లీకి బయలుదేరనున్నారు. మారుమూల పల్లెకు చెందిన ఒగ్గు రవికి అరుదైన గౌరవం దక్కడం పట్ల ఒగ్గు కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజయానికి ప్రతీక దసరా



బతుకమ్మ కుంటలో రావణ వధ దృశ్యం

జనగామ కల్చరల్, అక్టోబరు 13: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జిల్లాలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. కోరికలు అదుపులో ఉంచుకుంటే విజయతీరాలకు చేరవచ్చనేది ఈ పండుగ పరమార్థం. శక్తి స్వరూపిణిగా కొలిచే అమ్మవారు తొమ్మిదిరోజులు పోరాడి మరుసటి రోజు దశమి జరుపుకునే ఆనందోత్సవాలు నాటి నుంచి ఆనవాయితీగా వస్తోంది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ప్రజలు శమీపూజలో పాల్గొన్నారు. జనగామలో రావణ వధ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జనగామ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట మైదానంలో అధికారికంగా దసరా ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా కుంటకు ఆవలి వైపున భారీ రావణాసురుని ప్రతిమను ఏర్పాటు చేశారు. మైదానం నలు వైపులా రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. బతుకమ్మ కుంటకు వెళ్లే మార్గంలో జనగామ-సూర్యాపేట, జనగామ-హన్మకొండ రహదారిపై పోలీసులు ఆంక్షలు విధిస్తూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తరలివచ్చిన జనవాహిని..

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని బతుకమ్మకుంటలో రావణ వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు జిల్లా కేంద్రం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. ప్రజలు తమ తమ వాహనాలను మెయిన్ రోడ్డు పక్కనే పార్క్ చేసి సంబరాలను చూసేందుకు నడకమార్గంలో వెళ్లారు.

ఉత్సాహ పూరితంగా దసరా ఉత్సవాలు

బతుకమ్మ కుంట మైదానంలో ఉన్న విజయ దుర్గామాత దేవాలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మైదానంలో ఏర్పాటు చేసిన డీజే సౌండ్ సిస్టమ్ ద్వారా ఉత్సాహ పరిచే పాటలు వినిపించడంతో యువతులు మరింత ఉత్సాహంతో కేరింతలు వేస్తూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా సుమారు అరగంట పాటు బాణాసంచా పేల్చారు. అనంతరం రావణ వధ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన వారికి భద్రత పట్ల పోలీసులు మైక్ లో ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తూ ప్రశాంత వాతావరణం కల్పించారు.

హాజరైన ఎమ్మెల్యే పల్లా ..

జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఉత్సవాలకు హాజరైన ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాకే తెలంగాణలో బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ప్రత్యేకత సంతరించుకుందన్నారు. అనంతరం మునిసిపల్ కార్మికులను వేదికపైకి ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పోకల జమున, వార్డు కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

ఆయుధ పూజ నిర్వహించిన ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్ : దసరా పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండలోని ఆయన నివాసంలో శనివారం ఆయుధపూజ, వాహనపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరు దుర్గామాత ఆశిస్సులతో ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. చెడు పై మంచి సాధించిన విజయమే దసరా పండుగ అని, చెడు పై పోరాడి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



అభయాంజనేయ స్వామి దేవాలయంలో శమి పూజలో పాల్గొన్న ప్రజలు



ఉత్సవాలలో వేదికపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పుర ప్రముఖులు



ఆయుధ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- జిల్లాలో ఉత్సాహంగా విజయదశమి పర్వదినం
- బతుకమ్మ కుంటలో రావణ వధ
- తరలివచ్చిన అశేష జనవాహిని

• కొడకండ్ల : మండలవ్యాప్తంగా దసరా వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మండలకేంద్రంలో వివిధ పార్టీల ఆధ్వర్యంలో, కుల సంఘాల ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించి దుర్గాదేవికి, జమ్మి చెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆనందోత్సాహాల మధ్య ప్రజలు దసరా పండుగ నిర్వహించారు. అన్ని గ్రామాల్లో శమీపూజ చేసిన తర్వాత జమ్మి ఆకును బంగారంగా భావించి ఒకరికొకరు పంచుకుని తెలంగాణా సాంప్రదాయమైన అలాయిబలాయి నిర్వహించి పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

వేడుకగా వేంకటేశ్వర స్వామి వార కల్యాణం

చిలుపూర్, అక్టోబరు 13 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. శనివారం ఆలయ ఆవరణలో చేపట్టిన కళ్యాణ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల మధ్య వేంకటేశ్వర స్వామి-పద్మావతి అమ్మవార్ల కల్యాణ వేడుకలను వైభవంగా ముగించారు. అనంతరం కల్యాణంలో కూర్చున్న కుటుంబాలకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామివారి నిత్యసేవకులు, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, మాజీ దర్మకర్త సంగోజు మోహనాచారి, ఆలయ ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్లలో శమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి



జనగామలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ప్రజలు



చిలుపూర్ గుట్ట ఆలయంలో వేంకటేశ్వరుడి కల్యాణం జరిపిస్తున్న పూజారులు



పూజా కార్యక్రమాల్లో మంత్రి, మేయర్, కలెక్టర్

అలరించిన తెప్పోత్సవం

జలవిహారంలో హంస వాహనంపై అమ్మవారు

- నిజరూప దర్శనంలో భద్రకాళి
- దసరా రోజున పోటెత్తిన భక్తులు
- హాజరైన మంత్రి సురేఖ, కలెక్టర్

వరంగల్ కల్చరల్, అక్టోబరు 13: అంగరంగ వైభవంగా కొనసాగిన దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. దసరా రోజున అమ్మవారికి అపరాజిత, ఆయుధ శమి పూజలు నిర్వహించారు. వాహన పూజలతో భద్రకాళి అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకాన్ని చూర్ణోత్సవం శరభ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం చక్ర స్నానం, ధ్వజారోహణం, పుష్పరథ సేవతోపాటు భద్రకాళి అమ్మవారి జలక్రీడోత్సవ హంస వాహనం తెప్పోత్సవాన్ని రాత్రి నిర్వహించారు. ఈ తెప్పోత్సవంలో భద్రకాళి అమ్మవారిని ఊరేగించారు. నవ రాత్రుల్లో జలవిహార సేవ ఒక కార్యక్రమంగా నిర్వహిస్తారు. కార్యక్రమానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, రాజ్యసభ సభ్యులు వొద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బండా ప్రకాష్, కలెక్టర్ సత్య శారద హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రకాళి తటాకంలో జల విహారం తెప్పోత్సవాన్ని ప్రారంభించారు.

పోటెత్తిన భక్తులు

దసరా పర్వదినం సందర్భంగా ఉదయం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు ఆలయానికి భక్తులు పోటెత్తారు. దాదాపు లక్ష మంది భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. సర్వదర్శనానికి రెండు, మూడు గంటల సమయం పట్టింది. తోడు వీఐపీల రాకతో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. అమ్మవారిని దర్శించుకోవడంలో కాస్తభక్తులకు కాస్త ఇబ్బందులు ఎదురయ్యాయి.ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురు కాకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు తరలి వచ్చిన భక్త జనులకు సౌకర్యాలు కల్పించి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉత్సవాల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు అందించిన సహాయ సహకారాలు ముఖ్యంగా పోలీసు అధికారులు, అధికార యంత్రాంగానికి ప్రత్యేక యంత్రాంగానికి ధన్యవాదాలని ఆలయ ఈవో శేషు భారతి తెలిపారు. ఉత్సవాలకు విశేషంగా కృషి చేసిన వారికి మంత్రి కొండా సురేఖచే శాలువాలు, ప్రసాదాలను అందజేశారు.



జల విహారంలో హంస వాహనంపై తెప్పోత్సవం

నేడు కొలువుదీరనున్న మార్కెట్ పాలక వర్గం

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 13: స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ పీఠం పైన రెండో మహిళగా మండలంలోని రంగరాయగూడెం గ్రామానికి చెందిన జూలుకుంట్ల లావణ్య-శిరీష్‌రెడ్డి నేడు (సోమవారం) కూర్చోనున్నారు. వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యత కలిగిన స్టేషన్‌ఘన్‌పూర్ ఏరియాలో రైతులు పండించిన పంటలను పండించిన పంటలను విక్రయించుకోవడానికిగాను 1970 సంవత్సరం మధ్యలో శివునిపల్లి గ్రామంలో తాత్కాలిక భవనాన్ని కిరాయికి తీసుకుని మార్కెట్ కార్యకలాపాలను నిర్వహించారు. తదనంతరం గ్రామానికి చెందిన పోకల సాంబయ్య అనే రైతు వద్ద నుంచి ప్రభుత్వం 10 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. అందులో గోదాములు, మార్కెట్ భవన సముదాయాలను నిర్మించారు. 1980 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే గోక రామస్వామి చేతుల మీదుగా మార్కెట్ భవన సముదాయాలను ప్రారంభించారు. 1980 నుంచి మార్కెట్ చైర్మన్ల నియామకం జరుగగా మార్కెట్ మొదటి చైర్మన్‌గా చిట్టిమల్ల రంగయ్య ఎంపికయ్యాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2019 సంవత్సరం నుంచి మార్కెట్ కమిటీల నియామకాల్లో రిజర్వేషన్ల వ్యవస్థను తీసుకువచ్చారు. 2019లో ప్రభుత్వం మార్కెట్ చైర్ పర్సన్ రిజర్వేషన్ బీసీ-ఎ ఉమెన్‌కు కేటాయించగా మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన అక్కినపల్లి స్వర్ణలత మొదటి మహిళ చైర్ పర్సన్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రిజర్వేషన్ జనరల్ ఉమెన్‌కు ప్రభుత్వం కేటాయించగా మండలంలోని రంగరాయగూడెం గ్రామానికి చెందిన జూలకుంట్ల లావణ్య రెడ్డి ఎంపికయ్యారు. లావణ్య రెడ్డి ఎంపిక కావడంతో రెండవ మహిళగా, 12వ చైర్మన్‌గా మార్కెట్ పీఠంను అధిరోహించనున్నారు. నేడు ఉదయం 11గంటలకు నూతన పాలక మండలి కమిటీ ప్రమాణస్వీకారోత్సవం జరుగ నుండగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిరలు ముఖ్య అతిధులుగా హజరు కానున్నారు.

నూతన పాలకమండలి వివరాలు

మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య-శిరీష్ రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య డైరెక్టర్లు మాచర్ల కుమారస్వామి, మారపాక వసంత్, మాదిరెడ్డి యశ్వంత్ రెడ్డి, బాస్కుల కిరణ్, నీల వెంకటేశ్వర్లు, ఎమ్మీ అయూషాబేగం, కాసాని బొందయ్య, ఇల్లెందుల బాబు, పేరాల సుధాకర్, భూక్య సురేష్, వెల్మజాల రాంరెడ్డి, గోళి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి మెంబర్‌గా ఉంటారు.

కుటుంబ కలహాలతో గన్‌తో కాల్చుకుని..

ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆత్మహత్య

- మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ఘటన
- స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్





ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 13 : కుటుంబ కలహాలతో ఏఆర్ కానిస్టేబుల్ గుడిబోయిన శ్రీనివాస్ (59) ఆదివారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో స్ట్రాంగ్‌రూం వద్ద తన గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గోపాల్‌రావు నగర్ కాలనీకి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గుడిబోయిన శ్రీనివాస్‌కు అతని భార్య విజయలక్ష్మి మధ్య జరిగిన గొడవలతో పదేళ్ల క్రితం కుమారుడు సుశాంత్‌ను తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉంటోంది. శ్రీనివాస్ మహబూబాబాద్‌లో తల్లిదండ్రుల వద్ద ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ తనగన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. శ్రీనివాస్ 1990 సంవత్సరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి జిల్లా ఏర్పడిన తర్వాత హన్మకొండ నుంచి మహబూబాబాద్ పోలీస్ కార్యాలయానికి 2016లో బదిలీపై వచ్చాడు. 2018లో హెడ్ కానిసేబుల్‌గా పదోన్నతి పొంది, గతనెల నుంచి కలెక్టరేట్ కార్యాలయంలోని స్ట్రాంగ్‌రూం వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్ సహ ఉద్యోగి దాము భోజనం విరామ సమయంలో ఇంటికి వెళ్లాడు. ఎవరూ లేని సమయంలో ఆదివారం సాయంత్రం 4.40 గంటల ప్రాంతంలో శ్రీనివాస్ తన గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దాము మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లి వచ్చే సరికి శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకుని విగత జీవిగా పడి ఉండడంతో వెంటనే ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో పాటు డీఎస్పీ తిరుపతిరావుకు సమాచారం అందించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, డీఎస్పీ తిరుపతిరావు ఘటనా స్థలానికి వెళ్లి శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్న తీరును పరిశీలించారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య విజయలక్ష్మి, కుమారుడు సుశాంత్ ఉన్నారు. శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాన్న వర్ధంతికి వెళ్తూ.. కానరాని లోకాలకు..

అదుపుతప్పి కారు బోల్తా.. యువకుడు మృతి



రవీందర్‌రెడ్డి (ఫైల్)

లింగాలఘణపురం, అక్టోబరు 13: కన్నతండ్రి వర్ధంతి కార్యక్రమానికి హాజరుకావాలనే ఆతృత కొడుకు నిండు ప్రాణాలను బలితీసుకుంది. కారులో అర్ధరాత్రి అతివేగంగా ప్రయాణిస్తున్న క్రమంలో ఘోరరోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలై మృతిచెందిన ఘటన లింగాలఘణపురం మండలం వడ్డిచర్లలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే.. పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన నోముల రవీందర్‌రెడ్డి(32) అనే యువకుడు నల్లగొండ జిల్లా కేంద్రంలో వండర్‌వరల్డ్ పేరిట ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో నల్లగొండ నుంచి స్వగ్రామం మడకలో తన తండ్రి రాంచంద్రారెడ్డి రెండోవర్ధంతి కార్యక్రమం ఆదివారం జరగనుండగా అక్కడికి సకాలంలో చేరుకునేందుకు తెల్లవారుజామున కారులో బయలుదేరాడు. ఈక్రమంలో వడ్డిచర్ల శివారుకు చేరుకునేవరకు అతివేగానికి నిద్రమత్తు తోడై కారు అదుపు తప్పి రోడ్డుపక్కకు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన రవీందర్‌రెడ్డిని స్థానికులు 108 ద్వారా జనగామ ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి వద్ద రూ. 57120లు సెల్‌ఫోన్ ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. అయితే మృతుడికి తల్లి శ్రీలత, సోదరులు కిషన్‌రెడ్డి, రాజిరెడ్డిలు ఉండగా రాజిరెడ్డి వారం రోజుల క్రితమే ఉన్నత చదువుల నిమిత్తం లండన్‌కు వెళ్లడం గమనార్హం.

బైక్ అదుపు తప్పి ఒకరు..



మృతిచెందిన దయాకర్

లింగాలఘణపురం : మండలంలోని కళ్లెం శివారులో జనగామ నుంచి గుండాలకు బైక్‌పై అతివేగంగా వెళ్తున్న ఊర దావీన్ అలియాస్ దయాకర్(28) అనే వ్యక్తి అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దయాకర్ అక్కడిక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



యువతిని వేధించిన వ్యక్తికి దేహశుద్ధి

హనుమకొండ బస్టాండ్‌లో ఘటన

బాలసముద్రం, అక్టోబరు 13: మద్యం మత్తులో యువతిని వేధించిన ఓ వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన హనుమకొండ బస్టాండ్‌లో శనివారం రాత్రి జరిగింది. ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లాకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా పని చేస్తున్నది. దసరా పండుగ కోసం సొంత ఊరు ములుగుకు వెళ్లేందుకు బస్సులో హనుమకొండకు చేరుకుంది.

ములుగుకు వెళ్లే బస్సు కోసం వేచి ఉండగా తనతో రావాలంటూ ఆ వ్యక్తి వేధించాడు. విషయాన్ని అక్కడి సెక్యూరిటీ సిబ్బంది, ప్రయాణికుల వద్ద యువతి గోడు వెల్లబోసుకుంది. దీంతో అక్కడి వారు ఆ వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆ వ్యక్తి వివరాలను సెక్యూరిటీ సిబ్బంది ఆరా తీశారు. అతడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ఆ వ్యక్తి మద్యం మత్తులో ఉండడంతో పూర్తి వివరాలు సేకరించలేకపోయారు. అతడిపై చర్యలు తీసుకోవాలని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అంబరాన్నంటిన దసరా వేడుకలు


వరంగల్ ఉర్సు రంగలీలా మైదానంలో రావణ వధ వేడుకలను తిలకిస్తున్న ప్రజలు


వరంగల్ ఉర్సు రంగలీలా మైదానంలో రావణ వధ వేడుకల్లో మాట్లాడుతున్న నగర మేయర్ గుండు సుధారాణి




రంగలీలా మైదానంలో నృత్యం చేస్తున్న దృశ్యం


మహబూబాబాద్ జిల్లా గూడూరులో దసరా ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్, జాటోతు హుస్సేన్‌నాయక్


హనుమకొండ పద్మాక్షి ఆలయం వద్ద నిర్వహించిన దసరా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు


హనుమకొండ పద్మాక్షి ఆలయం వద్ద రావణ ప్రతిమకు నిప్పంటిస్తున్న ఎమ్మెల్యే నాయిని


ఉర్సు రంగలీలా మైదానంలో మిరుమిట్లు గొల్పుతున్న తారాజువ్వలు



మెడకు తాడు బిగించి చంపి

- గరిటతో మృతదేహం మర్మాంగాలను కాల్చిన భార్య
- పెనుగొండలో భర్తను హత్య చేసిన భార్య, అత్త, బావమరిది
- పోలీసులకు సమాచారం అందించిన ఆటోడ్రైవర్
- వీడిన కడప జిల్లా వాసి హత్య కేసు మిస్టరీ


ప్రశాంత్ మృతదేహం

కేసముద్రం, అక్టోబరు 13: కేసముద్రం మండలం పెనుగొండలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప పట్టణానికి చెందిన లక్కే ప్రశాంత్(30)ను ఆయన భార్య, అత్త, బావమరిది కలిసి తాడుతో ఉరివేసి చంపారు. భర్తను చంపిన అనంతరం అతనిపై కసితీరక అట్ల గరిటను వేడిచేసి మర్మాంగాలను భార్య కాల్చింది. ప్రశాంత్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో విచారణ అనంతరం మహబూబాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌చార్జ్ గూడూరు సీఐ బాబురావు తెలిపిన ప్రకారం... ఏపీలోని కడప జిల్లాకు చెందిన లక్కే ప్రశాంత్, అదే జిల్లా సింహాద్రిపురం మండలం చెవ్వారిపల్లి గ్రామానికి చెందిన అమినా ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. ఉపాధి కోసం కడప నుంచి నాలుగు నెలల క్రితం భార్య, పిల్లలతో కలిసి ప్రశాంత్ పెనుగొండలో భవన నిర్మాణ పని చేసేందుకు వచ్చాడు. అమినాకు రెండో పెళ్లి కావడంతో భర్త ప్రశాంత్ అనుమానిస్తూ పిల్లలు నాకు పుట్టలేదు అంటూ నిత్యం మద్యం సేవించి వచ్చి ఆమెను కొడుతుంటాడు. ఈ క్రమంలో తనను నిత్యం శారీరక, మానసిక హింసకు గురిచేస్తున్నాడని, ఇదే గ్రామంలో ఉంటున్న కడప జిల్లా పులివెందుల మండలం ఎర్రగుడిపల్లికి చెందిన అమినా తల్లి కడియాల నూర్జహాన్, సోదరుడు కడియాల అమర్‌భాషాలకు తన గోడు వెల్లబోసుకుంది. ప్రశాంత్ తనను, పిల్లలను, అవసరమైతే మిమ్మల్ని కూడా చంపుతాన ని బెదిరిస్తున్నాడని అమినా తల్లి, సోదరునికి తెలిపింది. ఈ క్రమంలో ప్రశాంత్‌ను చంపాలని ముగ్గురు కలిసి నిర్ణయించుకొని ఈనెల 10న అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల ప్రాంతంలో తాడుతో ప్రశాంత్ మెడకు ఉరిపెట్టి చంపారు. అయినా కసి తీరక అమినా అట్ల గరిట(సరాతం)ను స్టౌపై వేడి చేసి తన భర్త ప్రశాంత్ మర్మాంగంపై కాల్చింది. ఆ తర్వాత గ్రామంలో ఎవరికి అనుమానం రాకుండా మృతదేహాన్ని రైల్వేట్రాక్‌పై పడవేయాలని నిర్ణయించుకొని వారికి తెలిసిన మహబూబాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ రామును పిలిచారు. ఆటో డ్రైవర్‌ను మభ్యపెట్టి మృతదేహాన్ని ఆటోలో రైల్వేస్టేషన్‌కు తరలిస్తుండగా డ్రైవర్ రాముకు అనుమానం వచ్చి, వారిని నిలదీయగా హత్య విషయం బయటపడింది. దీంతో రాము వెంటనే 100 ద్వారా పోలీసులకు, 108కు సమాచారం అందించాడు. 108 సిబ్బంది ప్రశాంత్ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

సమాచారం అందుకున్న పోలీసులు నిందితులు అమినా, నూర్జహాన్, అమర్‌భాషాలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి పోలీసులకు సమాచారం అందించిన ఆటో డ్రైవర్ రామును, కేసు దర్యాప్తును వేగవంతంగా చేసిన ఎస్‌ఐ మురళీధర్‌రాజ్‌ను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు.

ఇమ్మడి వారి నాలుగు తరాల
ఉమ్మడి దసరా వేడుకలు


వరంగల్ ఇమ్మడి పుల్లయ్య నివాసంలో దసరా వేడుకల్లో నాలుగు తరాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 13: ఇమ్మడి నాలుగు తరాల ఉమ్మడి కుటుంబసభ్యులు దసరా పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. వరంగల్‌లోని ఇమ్మడి పుల్లయ్య నివాసంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో నాలుగు తరాలకు చెందిన సుమారు 70 మంది నూతన దుస్తులు ధరించి చిన్న..పెద్ద అనే తేడా లేకుండా ఆటా..పాటలతో ఆనందోత్సవాల నడుమ దసరా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇమ్మడి పుల్లయ్య మాట్లాడుతూ...ఇమ్మడి కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు ఉద్యోగ, ఉపాధిరీత్యా ఇతర ప్రదేశాల్లో నివాసముంటున్నప్పటికీ దసరా పర్వదినాన ఒకే చోట పండుగ జరుపుకొని కష్ట..సుఖాలను పంచుకోవడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

పద్మశ్రీ సమ్మయ్యకు ఘన సన్మానం


గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హరియాణా గవర్నర్ దత్తాత్రేయ

దేవరుప్పుల, అక్టోబరు 13: మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ గడ్డం సమ్మయ్యను ఆదివారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, అలయ్ బలయ్ చైర్మన్ విజయలక్ష్మిలు ఘనంగా సన్మానించి సత్కరించారు. గవర్నర్ దత్తాత్రేయ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగనున్న అలాయ్ బలాయ్ కార్యక్రమానికి సమయ్యను ఆహ్వానించగా ఆయన హాజరయ్యారు. కార్యక్ర మంలో సమ్మయ్య కుమారుడు హిమగిరి పాల్గొన్నారు.

పాత కక్షలతో యువకుడిపై కత్తితో దాడి

జఫర్‌గడ్, అక్టోబరు 13: మండలంలోని కూనూరులో సామల రంజిత్ అనే వ్యక్తిపై ఇదే గ్రామానికి చెందిన ముక్కెర గణేష్ కత్తితో దాడి చేశాడు. ఎస్‌ఐ బానోత్ రాంచరణ్ నాయక్ తెలిపిన ప్రకారం శనివారం సాయంత్రం గ్రామంలో జరిగిన దసరా ఉత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులతో కలిసి సామల రంజిత్ వీక్షిస్తున్నాడు. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన ముక్కెర గణేష్ పాత గొడవలను మనసులో పెట్టుకుని ఆగ్రహంతో కందుల శివకుమార్, ఇల్లందుల రాజేశ్‌ల సహకారంతో రంజిత్‌పై దాడి చేసి కత్తితో పొడిచి పారిపోయాడు. దీంతో కత్తిపోటుకు గురై కింద పడిపోయిన రంజిత్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. రంజిత్ తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, యువకుడి పరిస్థితి నిలకడగానే ఉందని బంధువులు తెలిపారు.

బయ్యారంలో విందు భోజనం

- కొత్త అల్లుడికి 66 రకాలతో వంటకాలు
- ఆంధ్ర సంక్రాంతి సంప్రదాయం తెలంగాణలోనూ..
- స్వరాష్ట్రంలో ప్రప్రథమంగా దసరాకు శ్రీకారం



బయ్యారం(మహబూబాబాద్ జిల్లా), అక్టోబరు 13 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మ దసరా పండుగను పురస్కరించుకొని బయ్యారంలో ఓ కుటుంబం కొత్త అల్లుడికి రకరకాల వంటకాలతో విందుభోజనం ఏర్పాటు చేశారు. ఆంధ్ర సంక్రాంతి సంప్రదాయాన్ని తెలంగాణలోనూ దసరాకు శ్రీకారం చుట్టిన ఆ కుటుంబం 66 రకాల వంటకాలతో భోజనం ఏర్పాటు చేసి ఔరా.. అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళితే...

వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన కల్లూరి రమేష్-కల్పన దంపతుల కూతురు శ్వేతకు ఆగస్టు 28న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామానికి చెందిన వంశీతో వివాహమైంది. తెలంగాణ ఆచార సంప్రదాయం ప్రకారం వివాహమైన తరువాత వచ్చే తొలి దసరా, ఉగాది పండుగలను ఛేదు పండుగలుగా భావించి, అత్త ఇంటి వారు కొత్త అల్లుడిని ఇంటికి తీసుకరారు. దీంతో బయ్యారంలో ఉంటున్న శ్వేత పిన్ని బాబాయి గరిపెల్లి లావణ్య-వేణు కుటుంబం నూతన దంపతులైన శ్వేత, వంశీలను దసరా పండుగకు ఆహ్వానించారు. ప్రతీ ఏడాది ఆంధ్ర రాష్ట్రంలో తొలి సంక్రాంతికి వచ్చే కొత్త అల్లుడికి అత్తింటి వారు రకరకాల వంటకాలతో భోజనం ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గమనంలో ఉంచుకున్న వేణు-లావణ్య దంపతులు తెలంగాణలోనూ ఆంధ్ర తరహా కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టాలని భావించారు. అందులో భాగంగా శనివారం దసరా పండుగకు వచ్చిన కొత్త అల్లుడికి 66 రకాల వంటకాలతో విందుభోజనం ఏర్పాటు చేశారు. వేణు కుటుంబం స్వరాష్ట్రంలో ఇలా నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టి కొత్త అల్లుడికి విందుభోజనం ఏర్పాటు చేసిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి చర్చనీయాంశమైంది.

గార్లలో జాతీయ జెండా ఆవిష్కరణ



గార్ల, అక్టోబరు 13 : మండల కేంద్రంలోని మసీదు సెంటర్లలో ఎంపీడీవో మంగమ్మ శనివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. తొలుత గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి జెండాను డప్పువాయిద్యాలతో గార్లలోని వీధుల్లో ఊరేగించారు. నైజాం నవాబుల కాలంలో దసరా రోజున నెలవంక ఉన్న నీలిరంగు జెండాను ఎగరవేయడం ఆనవాయితీగా వస్తుంది. నాటి నుంచి ఏటా దసరా పండుగ రోజు గార్ల మసీదు సెంటర్‌లో జాతీయ జెండాను పట్టణ మొదటి పౌరుడు ఎగర వేస్తారు. దేశంలో ఎక్కడాలేని విధంగా విజయ దశమిరోజు జెండాను ఆవిష్కరిస్తారు. 75 ఏళ్లుగా జెండాను ఎగరవేయడం జరుగుతుంది. 1952లో గార్ల టౌన్ మునిసిపాలిటీకి కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌గా మాటేటి కిషన్‌రావు ఎన్నికయ్యాడు. నాడు దసరా రోజున మసీదు సెంటర్‌లో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తుండగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ విషయంపై హైకోర్టుకు వెళ్లారు. దైవభక్తికి చిహ్నం మత సామరస్యానికి ప్రతీకగా జాతీయ జెండాను ఎగరవేయాలని తీర్పు ఇచ్చింది. నాటి నుంచి సర్పంచ్ చేతుల మీదుగా దసరా పండుగ రోజు జాతీయ జెండా ఎగరవేయడం జరుగుతుంది. సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో మండల ప్రత్యేక అధికారి ఎంపీడీవో మంగమ్మ చేతుల మీదుగా జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు అజ్మీరా బన్సీలాల్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన దసరా సంబురాలు


సీతారాంపురంలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు


షమి పూజ చేస్తున్న చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు


రాఘవపూర్‌లో దసరా వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు


జఫర్‌గఢ్ : దసరా వేడుకల సందర్భంగా అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

దేవరుప్పుల, అక్టోబరు 13: మండలకేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం దసరా పండుగ ఉత్సవాలు ఘనంగా, ప్రశాంతంగా జరుపుకున్నారు. జమ్మిచెట్టుకు ప్రత్యేకపూజలు చేశారు. ఊరు చివరకు వెళ్లి చెట్లపై ఉన్న పాలపిట్టలను దర్శించుకున్నారు. ఆ తర్వాత హిందూ, ముస్లీం తేడా లేకుండా ఒకరినొకరు జమ్మి పెట్టుకుంటూ అలాయ్ బలాయ్ తీసుకున్నారు. శనివారం రోజున దసరాపండుగ రావడంతో ఒక్కపొద్దు ఉన్నవారు మాంసం, మద్యానికి దూరంగా ఉన్నారు. దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఘనంగా పోలీసులు ఆయుధపూజ నిర్వహించారు. ఎస్సై సృజన్‌కుమార్, కానిస్టేబుల్ యాకేష్ పాల్గొన్నారు.

● లింగాలఘణపురం : లింగాలఘణపురం మండల వ్యాప్తంగా శనివారం విజయదశమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మండలంలోని నెల్లుట్లలో విజయదశమి ఉత్సవకమిటీ చైర్మన్ చిట్ల ఉపేందర్‌రెడ్డి ఆనవాయితీ ప్రకారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు.

● పాలకుర్తి : మండంలోని అన్ని గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై సాయిప్రసన్న కుమార్ బందోబస్తు నిర్వహించారు. ఆధ్వర్యంలో బొడ్రాయి వద్ద గ్రామ పంచాయతీ కార్యదర్శి కపిలవాయి వెంకేశ్వరాచారీ సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బంధూకులకు ఆయుధ పూజా చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు యాకాంతరావు, కమ్మగాని నాగయ్య, కడుదుల కర్ణాకర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాసరావు, సారయ్య పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ :మండలంలోని పలు గ్రామాల్లో శనివారం దసరా వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తాటికొండ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ చల్లా ఉమాదేవి-మాజీ వైస్ ఎంపీపీ సుధీర్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాగు మధ్యలో ఏర్పాటు చేసిన శమికొమ్మ చుట్టూ శేషవాహనంతో భక్తులు ప్రదక్షణలు నిర్వహించారు. డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ అవరణలో సీఐ జి.వేణు ఆయుధపూజను నిర్వహించారు.

● రఘునాథపల్లి, మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో జరిగిన దసరా వేడుకలలో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి ప్రత్యేక జమ్మి పూజలు చేశారు. తాజా మాజీ జడ్పీటీసి బొల్లం అజయ్‌మణికంఠ, రఘునాథపల్లి పంచాయతీ కార్యదర్శి కవిత, చింత స్వామి, మడికంటి మధు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : స్టేషన్ ఘన్‌పూర్ చెరువు కట్ట వద్ద, బొడ్రాయి వద్ద, తిరుమల నాథస్వామి దేవాలయంలో, శివునిపల్లి శ్రీవేంకటేశ్వరాలయంలో, సాయంత్రం జమ్మి చెట్లకు వేద పండితుల నేతృత్వంలో పూజలు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ చెరువు కట్ట వద్ద నిర్వహించిన దసరా ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పాల్గొన్నారు. పలువురిని ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో డప్పు కళాకారులతో కలిసి డప్పు వాయిస్తు ఉత్సాహం నింపారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎల్లమ్మ గుడి వద్ద, శివునిపల్లి గాంధీ విగ్రహం వద్ద శనివారం రాత్రి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా రావణ వధ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఘన్‌పూర్ తిరుమల నాథస్వామి దేవాలయంలో షమీ పూజలు ఘనంగా నిర్వహించారు.పూజారులు శేషాచారి, రామానుజాచారి ఆధ్వర్యంలో భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి, తిరుమల నాథునికి ప్రత్యేక పూజలు ఆచరించారు. శివునిపల్లి పట్టణ శ్రీ వేంకటేశ్వరాలయంలో వైభవంగా శమీ పూజలు నిర్వహించారు.

●జఫర్‌గడ్: జఫర్‌గడ్‌లో స్థానిక గాంధీ సెంటర్, వడ్డెగూడెం, షాపల్లి, తదితర గ్రామాల్లోని పలు చోట్ల జంతు బలి కార్యక్రమం నిర్వహించారు. కూనూరులో నిర్వహించిన రావణ వధలో భాగంగా తయారు చేయబడిన 30 ఫీట్ల ఎత్తు గల రావణుని బుట్టబొమ్మను అశేష ప్రజల సమక్షంలో టపాకాయలచే కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అలాగే పలు గ్రామాల్లో రామలీల కార్యక్రమాలను నిర్వహించారు.

● నర్మెట : మండలకేంద్రంతో పాటు మచ్చుపహాడ్, వెల్దండ, అమ్మాపురం, హన్మంతాపూర్, బొమ్మకూర్, కన్నెబోయినగూడెం, మల్కపేట, గండిరామవరం తదితర గ్రామాలలో దసరా పండుగను ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ అబ్బయ్య, ఎస్సై నగేష్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు.

● బచ్చన్నపేట : :దసరా ఉత్సవాలు గ్రామగ్రామాన శనివారం ఘనంగా జరిగాయి. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఎస్‌కే హమీద్ ఆయుధపూజ నిర్వహించారు. ఆలింపూర్ గ్రామానికి చెందిన పలువురిపై బచ్చన్నపేటకు చెందిన వారు పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని వాహనాలపై వచ్చి దాడి చేయటంతో, స్థానికులు ఎదురుదాడి చేశారని, ఈ ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

●చిలుపూర్: మండలంలోని చిన్నపెండ్యాల, చిలుపూర్, మల్కాపూర్, పల్లగుట్ట, శ్రీపతిపల్లి, రాజవరం తదితర గ్రామాల్లో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టి షమీపూజ చేశారు. అనంతరం ఒకరినొకరు అలాయ్ భలాయ్ చేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో చిలుపూర్ గుట్ట చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, రత్నాకర్ రెడ్డి, పేరాల సుధాకర్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏడవెళ్లి కృష్ణారెడ్డి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా నాయకుడు ఏడవెళ్లి మాధవరెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

● జనగామ కల్చరల్ : జిల్లా కేంద్రంలోని పాతబీటు బజారులో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం పాతబీటు బజారులోని శ్రీ నగరేశ్వర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో పట్టణ పురోహితులు బ్రహ్మశ్రీ అప్పయ్య శాస్త్రి, కృష్ణమాచార్య సిద్దాంతి ఆధ్వర్యంలో వైభవంగా శమీపూజ కార్యక్రమం నిర్వహించారు. ఒకరినొకరు జమ్మి పెట్టుకొని దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రావణ వధ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్టు అధ్యక్షులు పజ్జూరి గోపయ్య, బుద్దా రమేశ్, మహంకాళి హరిశ్చంద్ర గుప్త, పజ్జూరి జయహరి, పోకల లింగయ్య, బిజ్జాల నవీన్, పుల్లూరు శ్రీనివాసులు, జైన రమేశ్, నాగబండి రవీందర్, ఆరుగుల శ్రీనివాస్, గట్టు వెంకటేశ్వర్లు, పజ్జూరి లక్ష్మీనర్సయ్య, అయిత శ్రీనివాస్, ఉప్పుగల్ల రవీందర్ పూజారులు పాల్గొన్నారు.


జఫర్‌గడ్‌లో జమ్మి చెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


నర్మెటలో దసరా వేడుకల వద్ద పూజలు నిర్వహిస్తున్న కార్యదర్శి శ్రీధర్


స్టేషన్‌ఘన్‌పూర్‌టౌన్ :శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య


నెల్లుట్లలో గ్రామస్తులతో కలిసి ర్యాలీగా బయలుదేరిన చిట్ల ఉపేందర్‌రెడ్డి


రఘునాథపల్లిలో ర్యాలీగా వెళ్తున్న భక్తులు


జనగామ పాత బీటు బజార్‌లో శమి పూజ చేస్తున్న అర్చకులు



పాలకుర్తిలో ఆయుధ పూజలు చేస్తున్న సీఐ తదితరులు


బచ్చన్నపేట : ఆలింపూర్‌లో శమీపూజకు వెళుతున్న గ్రామస్థులు

రాంరెడ్డి వ్యక్తిత్వం గొప్పది : బండి సంజయ్

బచ్చన్నపేట, అక్టోబరు 13: ఏడాది గడిచినా రాంరెడ్డి వ్యక్తిత్వాన్ని ఎవరు మర్చిపోలేకపోతున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొడవటూరు గ్రామంలో గంగం రాంరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి మంత్రితో పాటు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు వేర్వేరుగా హాజరై నివాళులు అర్పించారు. వారి కుమారులైన సీపీయర్ జర్నలిస్ట్ గంగం మహేష్‌రెడ్డి, సర్పంచ్‌ల పోరం మండల మాజీ అధ్యక్షులు గంగం సతీష్‌రెడ్డి, వ్యాపారవేత్త సురేష్‌రెడ్డిలను పలకరించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు. కాగా కేంద్రమంత్రి బండి సంజయ్ కొడవటూరు గ్రామానికి వస్తున్న విషయం తెలుసుకున్న నేతలు అడుగడుగున ఘన స్వాగతం పలికారు. వీఎస్ఆర్‌నగర్ వద్ద శాలువాలు కప్పి సన్మానించారు. ప్రధాన రహదారిపై ఉన్న కొడవటూరు కమాన్ వద్ద జిల్లా ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప, అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి, మండల అధ్యక్షులు చిమ్ముల నరేందర్‌రెడ్డి, బేజాడి సిద్దులు, దొంతుల చంద్రమౌళి, పెండెం నగేష్ తదితరులు పుష్పగుచ్చాలు, పూలమాలలతో సన్మానించారు. కొడవటూరులో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శాలువా కప్పి మంత్రిని సన్మానించారు. రాజకీయాల్లో శత్రుత్వం ఉండదనే విధంగా ఇద్దరు కాసేపు ముచ్చటించుకున్నారు. నివాళులు అర్పించే సమయంలో సైతం ఎమ్మెల్యే పల్లా కోసం కేంద్ర మంత్రి ఆరా తీసి, పిలిపించుకుని ఇద్దరు ఒకేసారి నివాళులు అర్పించారు. కాగా పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సమస్యలు పరిష్కరించమని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంతరెడ్డి పాల్గొన్నారు.


రాంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

ఘనంగా ముగిసిన శరన్నవరాత్రులు


బచ్చన్నపేటలో పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 13: డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో 9 రోజుల పాటు నిర్వహించిన దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగిసాయి. స్థానిక ఎల్లమ్మ గుడి వద్ద, హనుమాన్ జ్యోతిషాలయం వద్ద, శివునిపల్లి గాంధీ విగ్రహం వద్ద, లలితాంబికా దేవాలయంలో ముగింపు వేడుకల్లో భాగంగా పెద్ద ఎత్తున హాజరైన భక్తులు కుంకుమ పూజ, ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన దేవీ నవరాత్రుల ముగింపు పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారి ఉత్సవ మూర్తితో రథయాత్ర నిర్వహించారు. పెద్ద చెరువు కట్ట వరకు చేపట్టిన రథయాత్ర తదుపరి విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. మండల కేంద్రమైన జఫర్‌గడ్‌తో పాటు మండలంలోని కూనూరు, ఉప్పుగల్లు గ్రామాల్లో ఉత్సవ కమిటీలు దుర్గాదేవిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు పండితుల వేద మంత్రోచ్చారణలతో విశిష్ఠ పూజలు నిర్వహించారు. కాగా, శోభాయాత్రకు ముందు అమ్మవారి పూజా సామాగ్రి, లడ్డూ ప్రసాదాలకు నిర్వహించిన వేలం పాటలో కలశం రూ.50 వేలు బజ్జూరి మణికాంత్, గుమ్మడికాయ రూ.72 వేలు దొడ్డ రాజ్‌కుమార్, లడ్డూ రూ.85 వేలకు కొణిశెట్టి వెంకన్న దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, రాజకీయ ప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● జనగామ కల్చరల్, అక్టోబరు 13: దేవీ శరన్నవరాత్రోత్సవాలు ముగియడంతో జిల్లాలో దుర్గామాత నిమజ్జనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం జనగామ మునిసిపాలిటీ పరిధి 27వ వార్డులో దుర్గామాతకు నిమజ్జనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా, అయితా శ్రీకాంత్, సోమ హనుమంతరావు, గోవిందు లోయ, బుస్సా పాండు, నందు బజాజ్, బచ్చు అశోక్, కందుకూరి శ్రీనివాస్, పోకల గోపి, మారం ప్రవీణ్, హరిప్రసాద్, లోయ లఖన్ లోహియా పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి బచ్చన్నపేట, పోచన్నపేట, తమ్మడపల్లి గ్రామాల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను కోరుకున్నట్టు తెలిపారు.

48 గంటల దీక్ష విరమణ


దీక్ష విరమణ చేయిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల అక్టోబర్ 13 : కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల రుణమాఫీ కొరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై వత్తిడి తేవడానికై గిర్నీతండా క్రాస్‌రోడ్డు వద్ద 48 గంటల నిరహార దీక్షను చేపట్టిన జీసీసీ మాజీచైర్మన్ డి.ఎ.గాంధీనాయక్ కు ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగ హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ విఫలమైందన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావ కూడా ఫోన్ ద్వారా గాంధీ నాయక్ దీక్షకు మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు సింధె రామోజి, నాయకులు పి.రాము, డి.వెంకటేశ్వర్‌రావు, ఎఫ్ఎస్‌సీఎస్ వైస్‌చైర్మన్ మేటిసోమరాములు, చెంచు రాజిరెడ్డి, ఎండి ఆసిఫ్, డి.జ్యోతి, దేశగాని సతీష్, రణధీర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

చిలుపూర్, అక్టోబరు 13 : యువత జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ ఆకాంక్షించారు. ఆదివారం మండలంలోని పల్లగుట్టలో, తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు, బుగులు వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ శ్రీధర్‌రావు తండ్రి, పొట్లపల్లి చక్రధర్‌రావు స్మారకంగా నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ప్రధమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు షీల్డులతో పాటు, రూ 10 వేలు, రూ 5 వేల చొప్పున నగదును ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.


క్రీడాకారులతో ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్

దాడి కేసులో ఇద్దరిపై కేసు

బచ్చన్నపేట, అక్టోబరు 13: మండలంలోని ఆలింపూర్ గ్రామంలో శనివారం రాత్రి దుర్గామాత నిమజ్జన కార్యక్రమం జరుగుతుండగా, బచ్చన్నపేటకు చెందిన మ్యాక మహేశ్, ఆలింపూర్‌కు చెందిన పొన్న రాకేష్‌లు మరికొంత మందితో కలిసి ఆలింపూర్ గ్రామానికి చెందిన పలువురిపై దాడి చేశారని ఎస్ఐ ఎస్‌కే హమీద్ తెలిపారు. ఇందులో రాగీరు రమేశ్ అనే వ్యక్తికి గాయాలైనట్టు తెలిపారు. చెంచు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు వివరించారు.

నలుగురిపై అట్రాసిటీ కేసు

బచ్చన్నపేట, అక్టోబరు 13: మండలంలోని దబకుంటపల్లి గ్రామంలో నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్‌కే హమీద్ తెలిపారు. శనివారం దసరా పండుగ సందర్భంగా డప్పులు కొట్టుకుంటూ ముచ్చనపల్లి హేమంత్, సాయికుమార్ మహిపాల్, సురేష్‌లు ముందు నడుస్తుండగా గ్రామానికి చెందిన దాసరి స్వామి, దండు ఉపేందర్, ప్రశాంత్‌గౌడ్, సుగుణమ్మలు మాకంటే మీరెలా ముందు వెళతారని దాడి చేశారని ఫిర్యాదు చేశారు. దీంతో నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

కాంగ్రెస్ నాయకుడికి కడియం పరామర్శ

చిలుపూర్, అక్టోబరు 13 : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న, లింగంపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మట్ట రాజయ్యను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. ఆదివారం హనుమకొండలోని గణేశ్ ఆస్పత్రికి చేరుకున్న కడియం రాజయ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు.

ఏఈఈగా ఎంపికైన యువతికి సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 13: డివిజన్ కేంద్రానికి చెందిన పొన్న రాజశేఖర్ కుమార్తె పొన్న వాసంతి ఇటీవల వెలువడిని ఏఈఈ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించి ఏఈఈగా ఎంపికయ్యారు. కాగా ఆదివారం డివిజన్ కేంద్రంలోని రజకసంఘం భవనంలో రజక సంఘం నాయకులు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. పొన్న ఉపేందర్, సత్యనారాయణ, బిక్షపతి, రవి, రమేష్, రాజేశ్వర్, శేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

లింగాలఘణపురం, అక్టోబరు13: లింగాలఘణపురం మండలం బండ్లగూడెంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో నైట్ వాచ్ ఉమెన్‌గా కాంట్రాక్ట్ పద్దతిలో పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 10వతరగతి పాసైన లింగాలఘణపురం మండలానికి చెందిన మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.9750 వేతనం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16 సాయంత్రం 4 గంటల లోగా దరఖాస్తులను కేజీబీవీలో అందజేయాలని, పూర్తి వివరాలకు 8179985886, 6281793098 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో జీపీ కార్మికుడి మృతి

రఘునాథపల్లి, అక్టోబరు 13: మండలంలోని కోమల్ల గ్రామ పంచాయతీలో వాటర్‌మెన్‌గా పని చేస్తున్న కొత్తపల్లి కృష్ణమూర్తి(56) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. కృష్ణమూర్తి గత 30 సంవత్సరాల నుండి జీపీలో వాటర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుని కటుంబానికి జీపీ నుండి రావాల్సిన వేతనంతో పాటు ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఏఎంవీఐగా ఎంపికైన హర్షవర్ధన్ రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 13: ఇటీవల వెలువడిన అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ (ఏఎంవీఐ) ఫలితాల్లో మండలంలోని ఛాగల్ గ్రామ పరిధిలోని శివారెడ్డిపల్లికి చెందిన దివంగత అన్నెం మహేశ్వర్ రెడ్డి-శోభ దంపతుల కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఎంపికయ్యారు. కాగా సోమవారం గ్రామస్తులు హర్షవర్ధన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది జూన్ మాసంలో పరీక్షలు జరుగగా ఈ నెల 10న ఫలితాలు విడుదల కాగా మెరుగైన ర్యాంకు సాధించి ఏఎం వీఐ ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. గ్రూపు-1కు సన్నదం అవుతున్నానని అడిషినల్ కలెక్టర్ ఉద్యోగం సాధించడమే లక్ష్యం అని తెలిపారు.